# దొరకని దొంగ

కుక్కలు తెగ మొరుగుతున్నాయి. గోడగడియారం రెండుదెబ్బలు
కొట్టింది. ఒకమూల గజగజ వణికించేచలి. అట్లాగే మెల్లిగా కిటికీతలుపుల
సందుల్లొంచి వాకిట్లోకి చూశాడు రవి. చలి మొహాన కొట్టేసింది. నక్షత్రాల
వెలుతురో ఎవరూ కనిపించలేదు. మళ్ళీ ముసుగుపెట్టి పడుకున్నాడు. కాని,
తనమనస్సు యేదో కలవరపెడుతూనేవుంది. కుక్కలు యింత అర్ధరాత్రివేళ
మొరగటానికి కారణము యేమైయుంటుందా అని రవి ఆలోచన. అసలే
భయస్తుడు. గాలికి తలుపు చప్పుడయినా కంగారుపడిపోతాడు. అందులో
ఒంటరికాపరం. పెద్దకొంపే తీసుకున్నాడు. కొంపనిండా యేదోరకపు సామాను
వుండనేవుంది. ఈ నవంబరు డిశంబరునెలలు వచ్చినాయంటె రవికి ప్రాణ
సంకటంగా వుంటుంది. నాలుగైదు యేళ్ళనుంచి యీ నెలల్లో ఒంటరిగానే
వుంటూ వస్తున్నాడు. అప్పటికీ యెవరో వకరు రవియింటికి పడుకోటానికి
వస్తూనే వుంటారు. అయినా బ్రహ్మచారి స్నేహితులు రవికిమాత్రం యెంత
మంది వున్నారు కనక! ఎక్కువభాగం ఒంటరిగానే వుండటం తటస్థిస్తూ
వుంటుంది. పగలల్లా ఆఫీసు, కాకపోతే అటుయిటు తిరుగుతూ ప్రొద్దూకే
టప్పటికి యిల్లుచేరుకుంటాడు. తాళంతీసి యింట్లో అడుగుపెట్టేసరికి సుజాత
యెదురుగా వస్తున్నట్లు, పిల్లలు నాన్నవచ్చాడు అని అంటున్నట్లు వూహించు
కుంటూ లోపలికి ధీమాగావెళ్ళి కొద్దిక్షణాలు నిరామయంగా వుంటాడు.
ఏ ఎలుకైనా కదిలినా, ఆ వాసనకనిపెట్టి పిల్లి దుమికినా రవి ప్రాణాలు నిలు
వునా యెగిరిపోయేవి. కళ్ళు బలవంతాన తెరుమకుని గదుల్లోకివెళ్ళి, అటు
యిటూచూసి, హడావిడిచేసి, వచ్చి కూర్చుంటాడు. పది అవుతుంటేగాని
నిద్రపట్టదు తనకు. వున్న నాలుగు బలుబులు వెలిగించేసి, తలుపులన్ని
గడియపెట్టి, వెంటిలేటర్లోంచి వచ్చేగాలి తనకు సరిపోతుందిలే అని తృప్తి

పడుతూ వుంటాడు. తాను యింత పిరికివాడని యితరులు అనుకోవటం మాత్రం యిష్టంలేదు. కాని ధైర్యంగా వుండలేడు, ఎన్నిసార్లు ధైర్యాన్ని ప్రదర్శించటంలో విఫలుడయ్యాడో తాను అనుకుంటున్నప్పుడల్లా తనకే సిగ్గేస్తూవుంటుంది. పిరికితనం అంత దౌర్భాగ్యం మరొకటిలేదు అంటే తప్ప కుండా వప్పుకుంటాడు. ఎప్పుడూ యింతేనా అని అనుకుంటూ గభాలున ముసుగు తీసేసి లేచాడు ప్రక్కమీదినుంచి.

ఆ చీకట్లోంచే ఎదురుగావున్న గూట్లో యేదో కదిలినట్లు కలిపించింది మనిషి అకారంగా. లేచినవాడు లేచినట్లుగా పరుపుమీద పడిపోయి, జంప కానకూడా కప్పేసుకున్నాడు. శరీరం అంతా వణికిపోతోంది. ఆ కదలికను గురించి రవి ఆ క్షణంలో ఎన్నోవిధాలుగా ఆలోచించుకుంటున్నాడు. రవికి స్వతహాగాదయ్యాలమీద నమ్మకంలేదు. కారణం దయ్యాల్నిగురించి ఎప్పుడూ కూడా యెక్కడాకూడా యెవ్వరితోనూ ప్రస్తావన తీసుకురాలేదు, అందువలనే వాటిమీద ఏ అభిప్రాయము లేదు. తటాలున ఆమాట తట్టింది రవికి. పెద్ద పెట్టున అరుద్దామనుకున్నాడు. కాని క్షణంలో అరుపు ఫలితాలు యెట్లా వుంటాయోకూడా తనకళ్ళకు కట్టినట్లు కనిపించింది. తాను చదివిన డిటెక్టివు నవలలన్నీ ఒక్కొక్కటీ గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. ధైర్యం రావటానికి డిటెక్టివు నవలలు చదవటం అలవాటు చేసుకున్నాడురవి. కాని దానివలనే రవికి యింకా పిరికితనం యెక్కువయిందని రవి స్నేహితులు అంటూ వుంటారు, ఆ నవలలన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటూవుంటే, ఆ గూట్లోంచి అదేదో తనమీదికే వస్తున్నట్లనిపించింది. ఇక ఆలోచించటానికికూడా భయంగానే వుంది. ఆ సాయంత్రం యింటికిరాగానే యేమేమిచేశాడో, ఆ క్రిందటినాడు యెక్కడెక్కడ తిరిగాడో అన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు. రాత్రి లైట్లు వెలిగించి పంపుదగ్గర చెయ్యికడుక్కుని లోపలకు వచ్చాడు. మొహంకూడా సబ్బుతో కడుక్కున్నాడు. దువ్వెనకోసం అలమారుదగ్గరకు వెళ్ళేటప్పటికి వులిక్కిపడ్డాడు. తలెత్తి చూసేటప్పటికి గడియారం గంటలు కొడుతోంది.

అంతవరకూ అన్నీ సరిగానే వున్నాయి. ఏదో హఠాత్తుగా తట్టింది రవికి. ఛీ! పాడుబ్రతుకు! ఇంత భయమామరి. నా భయానికితోడు మతిమరుపుకూడానా అని అనుకుంటూ జంపకానాని విసిరి నేలకేసికొట్టి, ఆ గూట్లో ఆపెద్దఅద్దాన్ని తీసేసి అట్టడుగుఅరలో బోర్లించి పెట్టేశాడు. బయ్‌మంటూ కుక్క నోరెత్తింది. వెంటనే ఇంకోకుక్క కూడా అందుకుంది. రవికి మళ్లీ సంధిగ్ధావస్థ వచ్చింది. గట్టినమ్మకంకూడా యేర్పడింది. ఎవరో మనిషి యిటువైపుకువచ్చి వుంటాడు అది నిశ్చయం. వాడు తప్పకుండా దొంగే అయివుంటాడు. ఎట్లాగైనా వీణ్ణి పసికట్టి పట్టేశెయ్యాలి. ఇక తనకు పిరికివాడనే బిరుదు శాశ్వతంగాపోయి పెద్ద ధైర్యశాలి, సాహసి, చతురుడు, అనే బిరుదులువచ్చి మీదపడతాయి. ఇది రవి పెద్దఆలోచన సిద్ధమవుతున్నాడు. కిటికీ తలుపుసందులు కొంచెం పెద్దవిచేశాడు.

మనిషి అలికిడి యేమీ కనిపించటంలేదు. తన కిటికీకి యెదురుగా వున్న యింకో యింటికిటికీ చువ్వల్లోంచి కాంతివస్తూ పోతూవున్నట్లు కని పించింది. ఆ కుక్కలు ఖవ్‌మంటంకూడా తనకు సన్నిహితంగానే విని పించిందికదా. ఇక అల్లేశాడు జరిగిన విషయాన్ని. ఒక మనిషికూడా ఆ యింట్లో తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. దబ్బున తన కిటికీ మూసేశాడు. ఇక కుక్క అరవదు అరవటానికి వీల్లేదు. మనిషి లోపలికి ప్రవేశించినతరువాత యిక కుక్క చేసేదేముంది. మనిషి చెయ్యాలి యేదైనా చెయ్యకలిగితే, తన తెలివితేటలకు, తన చాకచక్యానికి, తన ధైర్యానికి యెవరైనా అక్కడక్కడే ప్రశంసించేవాళ్ళుంటే యెంతో బాగుంటుందనుకున్నాడు. తాను చెయ్యబో తున్న సాహసచర్యనుగురించి తర్వాత యెవరితోనన్నా చెపితే నమ్ముతారా, వట్టిదే వీడు యింతపని చెయ్యగలడా అని అనుకుంటారా అనే సందేహం రవిని క్షణంసేపు పీడించింది. ఐతే దొంగని పట్టియిస్తాంగా అంతకంటే యేంసాక్ష్యం కావాలి అని అనుకుని తృప్తిపడ్డాడు. ఆ కిటికీలోంచి కన్నార్ప కుండా అవతల యింట్లోకి చూస్తున్నాడు. దొంగ ఆ గదిలో మంచందగ్గర

వంగున్నట్లు కనిపించింది. రవి క్షణంలో గ్రహించేశాడు. ఏదో పెట్టె సర్దు తున్నట్లుకూడా చాలా సన్నిహితంగా చప్పుడయింది. పెట్టెమూత వేసినట్లు కూడా చప్పుడయింది. అనుకోకుండా చప్పున తనగదివైపు చూశాడు. మళ్లీ చెవులు నిక్కపొడుచుకుని అట్లాగే చూస్తు కూర్చున్నాడు. అక్కడ మనిషి లేచి నుంచున్నట్లు స్పష్టంగా చూశాడు. తానులేచి నుంచున్నాడు. అడుగుల్లో అడుగు వేసుకుంటూ మెల్లిగా వాకిటి తలుపుదగ్గరకు వెళ్ళాడు రవి. గడి యారం కొట్టిన ఒకగంటకు కూడా రవి దద్దరిల్లిపోయాడు. ఆ గడియారం మీద యెంతైనా కోపంవచ్చింది. ఆ గంట చప్పుడు ఆ దొంగకు వినిపించి పారిపోతాడేమోనని రవి భయం. ఆ దొంగ బైటనుంచి వెళ్లిపోయే సమయా నికి తాను ఆ గుమ్మందగ్గరకు వెళ్ళి పట్టుకోవాలని రవి ప్రయత్నం. తాను తీసిన తలుపును దగ్గరగా లాగి, చకచక చప్పుడుకాకుండా ఆ యింటి గుమ్మంవైపుకు నడిచాడు. వెంటనే అవతలగావున్న ఒక కుక్క రయ్‌మంటూ బవ్‌మన్నది. రవిప్రాణాలు యెగిరిపోయినాయి.

ఆకుక్కను తప్పించుకునే ఉపాయం యేదీకనిపించటంలేదు. వెంటనే కూర్చోబడిపోయాడు. ఆ కుక్క విశ్రాంతిలేకుండా అరిచేస్తోంది. అక్కడే నిలబడి. ఆ ఇంట్లోంచి ఆ మనిషి బైటకు వచ్చేశాడు. వాకిట్లోకికూడా గబ గబ నడుస్తూ వస్తున్నాడు. దొంగ తనవైపే అట్లా 'ఎవరూ' అంటూ గట్టిగా అన్నాడు ఒక మనిషి. రవికి స్పృహరాలేదు.

ఇంకొకసారి గద్దించి అడిగాడు ఆయన. రవి తెప్పరిల్లుకోవటంలేదు. చేతిలోవున్న బ్యాటరీలైటును రవి మొహాన వేసిచూశాడు ఆయన.

'రవివర్మగారు............మీరా............ఇట్లా పడిపోయారే' అంటూ గాబరాగా అటూ యిటూ చిందులు తొక్కాడు ఆయన.

తన పేరుపెట్టి పిలిచేటప్పటికి రవికి యెక్కడినుంచో ప్రాణంవచ్చింది మెల్లిగా కళ్ళుతెరచి లేవబోయాడు.

'ఏమిటండీ అట్లా పడిపోయారు' ఇంకా ఆయన అదుర్దా తగ్గలేదు.

'అబ్బ ఏంలేదండీ, రాత్రంతా వికారం కళ్ళు తిరగటమునూ, యిట్టే వాకిట్లోకి వచ్చేటప్పటికి వళ్లు తెలియకుండా పడిపోయాను' ముచ్చెమటలు పోసినాయి రవికి. అప్పటికప్పుడే కాకులు కావుకావు మంటున్నాయి.

రవి చెయ్యిపట్టుకుని నడిపిస్తూ 'నాకు రాత్రి కంటిమీద కునుకులేదు. మా చెల్లెలికి ఏ సమయంలో మందు యివ్వాలిసి వస్తుందో అని మెలుకువతోనే వున్నాను. నన్ను పిలవకపోయారా మందిచ్చేవాణ్ణి. మీరు భయపడకండి. ఈ పైత్యం అంతా రెండుడోసులు తీసుకుంటే తగ్గిపోతుంది' అంటూ మధు తన యింట్లోకి తీసుకుపోయాడు.

తెల్లారేటప్పటికి రవివర్మగారింట్లో దొంగలు పడ్డారన్న సంగతి వూరంతా పాక్కిపోయింది.

గ్రంథాలయము